
సాక్షి గుంటూరు

సోమవారం ▪ 6 ▪ మే ▪ 2024



ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామంలోని మహంకాళేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోగల శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ఓటమి భయంతోనే దాడులు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేటరూరల్: ఓటమి భయంతోనే టీడీపీ దాడులకు పాల్పడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మండలంలోని రావిపాడు వెంగళరెడ్డి కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై శనివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. కాలనీలో ప్రచారం ముగిసిన అనంతరం టీడీపీ కార్యకర్తలు తన ఇంటి ముందు ఉన్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులపై ఒక్కసారిగా కర్రలతో దాడులకు దిగారు. దాడిలో బొడ్డు శ్రీనివాసరావు, చందు, శాలమ్మ గాయపడ్డారు. వీరిని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నరసరావుపేటలో గెలవడం కష్టమని తెలిసి టీడీపీ హింసకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించే కుట్ర జరుగుతుందన్నారు. ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, నాయకులు మూరే రవీంద్రారెడ్డి, జాన్ ఉన్నారు.

పింఛన్ తీసుకోవడానికి వెళ్లి వృద్ధురాలు మృతి

బెల్లంకొండ: పెన్షన్ తీసుకోవడానికి వెళ్లి 75 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని పాపాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన ఓర్సు వెంకటరమణ (75)కు దాచేపల్లి స్టేట్ బ్యాంకులో అకౌంట్ వుంది. ఆమె పింఛన్ నగదు బ్యాంకు అకౌంట్‌లో జమ అయినట్లు చెప్పడంతో తీసుకోవడానికి శనివారం బ్యాంకుకు వెళ్లింది. ఎండలో బ్యాంకు వద్దకు వెళ్లి డబ్బులు తీసుకుని బయటకు వచ్చిన వృద్ధురాలు కళ్లు తిరిగి పడిపోయింది. గమనించిన స్థానికులు ఆమె వద్దకు వెళ్లి గమనించగా చనిపోయినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఉన్న బ్యాంకు అకౌంట్ పుస్తకం, పెన్షన్ బుక్‌లో వివరాలు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆటో తీసుకుని వెళ్లి వెంకటరమణ మృతదేహాన్ని స్వగ్రామం పాపయపాలెం తీసుకుని వచ్చారు. గతంలో మాదిరిగా వలంటీర్ల ద్వారా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి ఉంటే మృతిచెంది ఉండేది కాదని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

పిడుగుపాటుకు గేదెలు మృతి

రెంటచింతల: రెంటచింతల గ్రామ సమీపంలోని జ్యోతి స్వరూప కోల్డ్ స్టోరేజ్ వద్ద పంటపొలాలలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై రెండు పాడిగేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బోయిన మైసయ్య తన గేదెలను మేత (పశుగ్రాసం) కోసం పొలం వెళ్లగా సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి పెనుగాలులతోపాటు పిడుగులు పడ్డాయి. గేదెలు ఉన్న ప్రాంతంలో పిడుగు పడడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 1.40 లక్షలు ఉంటుందని మైసయ్య తెలిపారు.

59 మేకలు మృతి

దుర్గి:మండలంలోని కాకిరాల గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గురై 59 మేకలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన బూదిరి లక్ష్మయ్య, కొంగా గోవిందు, కొంగా పెదగంగయ్యలు మేకలను మేపుకునేందుకు పొలానికి వెళ్లారు. వర్షపు జల్లులు పడుతుండగా మేకలను చెట్టు కిందకు తోలుకెళ్లారు. ఆ సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే 59 మేకలు మృతి చెందాయి. బూదిరికి లక్ష్మయ్యకు చెందిన 40 మేకలు, కొంగా పెద గంగయ్య 15, కొంగా గోవిందు నాలుగు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. పిడుగుపాటుకు కొంగా లక్ష్మీనారాయణ, బూదిరి లక్ష్మయ్యలు స్పృహ తప్పి పడిపోయారు. వర్షం వెలిసిన అనంతరం గ్రామస్తులు పొలానికి వెళ్లి ఘటనాస్థలాన్ని చూసి వెంటనే వారి బంధువులకు సమాచారాన్ని ఇచ్చారు. అనంతరం వారిరువురిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట ఆసుపత్రికి తరలించా రు. ఘటనా స్థలాన్ని వీఆర్వో రత్నప్రకాష్ సందర్శించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రచార పర్వం



వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య, వైఎస్సార్ సీపీ నాయకురాలు నందమూరి లక్ష్మీపార్వతితో కలిసి ఆదివారం తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. నులకపేట మసీదు బయట ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. - తాడేపల్లిరూరల్



తెనాలి ఐతానగర్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించగా, స్థానికులు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఆయనకు హారతులు ఇచ్చారు. ఫ్యాను గుర్తుకు ఓటువేసి అభివృద్ధి, సంక్షేమాన్ని గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. - తెనాలిఅర్బన్



వైఎస్సార్ సీపీ తాడికొండ అభ్యర్థి మేకతోటి సుచరిత ఆదివారం తుళ్లూరు గ్రామంలో పర్యటించారు. అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని, ఫ్యాను గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ఆర్సీఎం చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు పాల్గొన్నారు.- తాడికొండ

గుంటూరు విచ్చేసిన హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ నరేందర్



రాష్ట్ర హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ నరేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీ

ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో భేటీ

నగరంపాలెం: ఏపీ హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ జి.నరేందర్ ఆదివారం గుంటూరు విచ్చేశారు. రైల్వే అతిథి గృహం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్‌డూడీలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ నరేందర్‌తో జిల్లా జడ్జి పార్థసారథి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్‌డూడీలు సమావేశమయ్యారు. అనంతరం జిల్లా కోర్టులో జరిగిన రివ్యూ సమావేశంలో జస్టిస్ నరేందర్ ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో సమావేశమయ్యారు. వృద్ధులకు సంబంధించి కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తుల విధి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయమూర్తులతో గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం



గుంటూరు ఏసీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేచిఉన్న ఉద్యోగులు



ప్రభుత్వ మహిళా కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు



అధికారులకు సూచనలు ఇస్తున్న తూర్పు ఆర్ఓ, కమిషనర్ కీర్తి

గుంటూరు వెస్ట్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు ప్రొసీడింగ్ అధికారులు, సహాయక ప్రొసీడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం కూడా వీరు ఓటింగ్‌లో పాల్గొంటారు. ఇతర పోలింగ్ సిబ్బంది 7వ తేదీన, అత్యవసర సిబ్బంది ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు పోస్టల్ ఓటింగ్‌లో పాల్గొనే అవకాశముంది. తొలి రోజు గుంటూరు పశ్చిమలో 622 మంది, తూర్పులో 315, పొన్నూరులో 145 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉత్సాహంగా హోం ఓటింగ్ ..

జిల్లాలో హోం ఓటింగ్ ప్రకియ ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. 2348 ఓటర్లగానూ 2069 మంది పాల్గొన్నారు. మంగళగిరిలో అత్యధికంగా 440 మంది హోం ఓటింగ్‌లో పాల్గొన్నారు.

కూటమి అవినీటి కథ

- దూరదృష్టితో తెనాలి వాసుల దాహార్తిని తీర్చేందుకు కృష్ణాజలాల పథకం చేపట్టిన మహానేత వైఎస్సార్
- అవినీతితో పథకం నాణ్యతను దెబ్బతీసిన నాటి ఎమ్మెల్యే, నేటి తెనాలి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్
- అనంతరం కార్పొరేట్లకు కట్టబెట్టిన నాటి టీడీపీ ప్రభుత్వం
- ఆత్మకూరు పేరుతో రియల్టర్ల బహుళ అంతస్తులకు తెనాలి తాగునీటి పథకంలో వాటా
- కోకాకోలాకు, ఐటీ పార్కుకు, టీడీపీ ఆఫీసుకు కేటాయింపు
- పట్టణ ప్రజల కంటే కార్పొరేట్ దోస్తులకే అధిక ప్రాధాన్యం





ఇటీవల ఆత్మకూరు వద్ద ప్రధాన పైప్‌లైన్ లీకేజ

తెనాలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన రక్షిత తాగునీటి పథకం నాటి స్థానిక పెద్దల నిర్వాకంతో నాణ్యత డొల్లయింది. పథకం ఆరంభం నుంచి ఇప్పటికీ లీకేజీలు వెక్కిరిస్తూనే ఉన్నాయి. నాణ్యత సంగతటుంచితే గత టీడీపీ పాలనలో తాగునీటి పథకాన్ని ఆ పార్టీ నేతలు తమ స్వార్థప్రయోజనాలకు వాడుకున్నారు. రాజధాని ప్రాంతంలో బడా రియల్టర్ల ప్రయోజనాలకు పెద్దపీట వేశారు. కోకాకోలా కంపెనీ, టీడీపీ కార్యాలయంతో సహా రకరకాల అవసరాలకు తాగునీటిని కేటాయించారు. మంగళగిరి మండల గ్రామం ఆత్మకూరు పంచాయతీ పేరుతో అక్కడ విస్తరిస్తున్న టీడీపీకి చెందిన బడా రియల్టర్ల భవన సముదాయాలకు తెనాలికి వచ్చే కృష్ణాజలాల్లో వాటాను పంచారు.

సురక్షిత తాగునీటి ఆవశ్యకత గుర్తించి..

2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక తెనాలి పట్టణానికి రక్షిత తాగునీటి అవసరాన్ని గుర్తించారు. ప్రకాశం బ్యారేజీ దగ్గర్లోని సీతానగరం నుంచి కృష్ణాజలాలను ప్రత్యేక పైపులైను ద్వారా తెనాలికి రప్పించి, ఇక్కడ నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా ప్రజలకు రక్షిత తాగునీటిని అందించాలని తలపెట్టారు. రూ.94.17 కోట్ల విలువైన ఈ కేంద్ర ప్రభుత్వ పథకానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా డబ్బును జమచేశారు.

శరవేగంగా తాగునీటి పథకం..

2009లో రెండో పర్యాయం ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన వైఎస్సార్ తాగునీటి పథకానికి తెనాలిలో శంకుస్థాపన చేశారు. 2030 నాటికి పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకుని అమల్లోకి తెచ్చిన పథకంలో భాగంగా సీతానగరం వద్ద ఇన్‌టేక్ వెల్ కమ్ పంప్‌హౌస్ నిర్మాణం, నీటి పంపులు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, అక్కడ్నుంచి 34 కిలోమీటర్ల ప్రత్యేక పైపులైన్, తెనాలిలో హెడ్‌వర్క్స్, తూర్పు కాలువలో ఆఫ్‌టేక్ నిర్మాణం చేశారు. ఇక్కడ రా వాటర్ పంప్, పంప్ హౌస్, 30.50 ఎంఎల్‌డీ ఫిల్టరేషన్ ప్లాంటు నిర్మాణం చేశారు. హెడ్‌వర్క్స్, గాంధీనగర్, చినరావూరు, ఉడా కాలనీ, పినపాడు, చంద్రబాబునాయుడు కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించారు. హెడ్‌వర్క్స్ నుంచి వివిధ ప్రాంతాల్లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపి, అక్కడ్నుంచి గృహ కనెక్షన్లకు సరఫరా ఇవ్వాల్సిఉంది. అప్పట్లో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలోనే ఈ పనులన్నీ జరిగాయి. ఆయన నిర్వాకంతోనే పథకంలో నాణ్యత లేదన్న ఆరోపణలున్నాయి.

టీడీపీ అధికారంలోకి రావడంతో..

2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చాక, తాగునీటి కనెక్షన్‌కు అధిక మొత్తాలను నిర్ణయించటంతో ప్రజల నుంచి స్పందన రాలేదు. మళ్లీ కొంతమొత్తాన్ని తగ్గించినప్పటికీ స్పందన లేదు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వ అమృత పథకం నిధులు రావటంతో ముందుగా ఉచిత కనెక్షన్లు ఇచ్చేందుకు మున్సిపాలిటీ ఉపక్రమించింది. ఐదేళ్లలో కనీసం 25 శాతం కనెక్షన్లు కూడా టీడీపీ ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. తగినన్ని కనెక్షన్లు లేనందున నీటి వినియోగం జరగదని తెలిసిందే. ఆ సాకుతో తెలుగుదేశం పాలకులు తాగునీటిని ఇతరులకు కట్టబెట్టారు. తొలిదశలో పెదవడ్లపూడి దగ్గర్లోని కోకాకోలా కంపెనీకి ఐదు మిలియన్ లీటర్లను కేటాయించారు. 2014–15లో నాటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ మౌఖిక ఆదేశాలతో మున్సిపాలిటీ అందుకు తీర్మానం చేసింది. శీతల పానీయాల కంపెనీకి తాగునీటిని అమ్ముకోవటం ఏమిటంటూ ప్రతిపక్ష వైఎస్సార్ సీపీతో సహా వివిధ రాజకీయపక్షాలు ఆందోళనకు దిగాయి. తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం కోర్టును ఆశ్రయించింది. కోర్టు విచారణలో ఉండగానే 2018 ఆగస్టులో రాజధాని పరిధిలోని ఐటీ పార్కుకు 3 మిలియన్ లీటర్లు, జూలై 31న రాజధానిలో నిర్మిస్తున్న టీడీపీ కార్యాలయానికి 0.75 మిలియన్ లీటర్లను మున్సిపల్ కౌన్సిల్ కేటాయించింది. ఎన్నికలకు రెండు నెలల ముందు 2019 ఫిబ్రవరి 15న మంగళగిరి మండలం ఆత్మకూరు పంచాయతీకి మరో 8 మిలియన్ లీటర్ల నీటిని కేటాయిస్తూ అత్యవసర సమావేశంలో కౌన్సిల్ తీర్మానించింది.

కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం..

మున్సిపాలిటీ తీర్మానాల వెనుక అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజా ఆదేశాలు ఉన్నాయని తెలిసిందే. నాటి ప్రతిపక్ష వైఎస్సార్ సీపీతో సహా వివిధ ప్రజా సంఘాల అభ్యంతరాలను ఆయన బేఖా తరు చేశారు. తెనాలి పథకానికి వచ్చే 30.5 మిలియన్ లీటర్లలో 16.7 మిలియన్ లీటర్లను ఇతరులకు కట్టబెట్టి, పట్టణ ప్రజల సంక్షేమంకన్నా, సొంత రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారు. టీడీపీ పెద్దల మెప్పుతోపాటు ఆత్మకూరు పంచాయతీ పరిధిలోని లింగమనేని సోదరులు, మంజీరా గ్రూపుతో సహా కార్పొరేట్ కంపెనీలకు చెందిన 1200 భవన సముదాయాలు వచ్చేశాయి. ఆత్మకూరు పంచాయతీ పేరుతో ఆయా రియల్టర్లకు మేలు చేకూర్చేందుకే తెనాలి నీటిని కట్టబెడుతున్నారని ప్రజాసంఘాల నాయకులు అప్పట్లో ఆరోపించారు. అంతేకాదు... తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ఆత్మకూరును సందర్శించి, నిజనిర్ధారణ కూడా చేసింది. ప్రజలెలా పోతే మాకేంటి...! అన్నట్టుగా పార్టీ పెద్దలు/అమాత్యులు, కార్పొరేట్ దోస్తీల కోసం తెనాలి నీటి పథకంలో వాటాను కట్టబెట్టేందుకు ఆగమేఘాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఆ ప్రకారం కౌన్సిల్‌లో తీర్మానాలూ చేయించారు. వీటన్నిటినీ గమనించిన ప్రజలు 2019లో తమ తీర్పును సరిగ్గానే చెప్పారు. మళ్లీ ఇప్పుడు ఆయా పార్టీల నేతలు కూటమి పేరుతో ప్రజల ముందుకొస్తున్నారు. అభివృద్ధి హామీలు గుప్పిస్తున్నారు. నమ్మేదెలా.. అంటున్నారు జనం.

పవన్‌ను పిలిచి అవమానించిన టీడీపీ

- టీడీపీ కుట్రలో భాగంగానే పవన్ కల్యాణ్ సభ అట్టర్ ఫ్లాప్
- ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామాజికవర్గం వారు హాజరుకాకపోవడమే అందుకు నిదర్శనం
- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: పొన్నూరులో తలపెట్టిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభను టీడీపీ కుట్రపూరితంగా వ్యవహరించి విఫలం చేసేందుకు యత్నించిందని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ పొన్నూరు కార్యాలయంలో అంబటి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ భాగస్వామ్యం కాకపోవడంతోనే సభకు స్పందన కరువైందన్నారు. పవన్ కల్యాణ్‌ను పిలిచి అవమానించినట్లయిందన్నారు. పవన్ హెలికాప్టర్ నిలుపుకొనే హెలిప్యాడ్ విషయంలో కాంట్రాక్టర్‌తో చేసిన బేరసారాల్లో విఫలమైన ధూళిపాళ్ల ఎదుటివారిపై నిందలు మోపాడని ధ్వజమెత్తారు. తమ నేతకు జరిగిన అవమానాన్ని జనసైనికులు గ్రహించారని అన్నారు. మండే ఎండలో సభలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలకు తాగునీరు, భోజన వసతి కల్పించడంలో టీడీపీ నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. తమ అభిమాన నటుడిని చూసేందుకు మాత్రమే కొద్దోగొప్పో ప్రజలు వచ్చారని, టీడీపీపై అభిమానంతో మాత్రం కాదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ సభలో టీడీపీ అభ్యర్థి సామాజిక వర్గం వారు ఎక్కడా కనిపించకపోవడం చూస్తే జనసేనపై టీడీపీకి ఉన్న గౌరవం అర్థమవుతోందని, ప్రజలు ఈ విషయం గ్రహించాలన్నారు. పవన్‌కల్యాణ్ తన గురించి ప్రస్తావించకపోవడమే తన నిజాయతీకి నిదర్శనమని అన్నారు.

- స్థానిక రాజకీయాలపై అవగాహన లేని పవన్ కల్యాణ్, అంబటి రాయుడు ప్రచారానికి వచ్చి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని అడగడం సిగ్గుచేటన్నారు. పొన్నూరులో అధికంగా ఉన్న కాపు సామాజిక వర్గం ఓట్లకోసం టీడీపీ ఆడిన బొమ్మలాటలో పవన్‌కల్యాణ్, అంబటి రాయుడులు పావులుగా మారారని విమర్శించారు. సినీ, క్రికెట్ గ్లామర్‌తో పవన్, అంబటి రాయుడు పాల్గొన్నా టీడీపీ పన్నాగం ఫలించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ పొన్నూరులో పెత్తందారీ వ్యవస్థను భూస్థాపితం చేయాలన్న లక్ష్యంతో గత ఎన్నికల్లో కిలారి వెంకట రోశయ్యకు, ఈ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించారని ఈ విషయాన్ని పవన్‌కల్యాణ్, అంబటి రాయుడు గ్రహించాలని హితవుపలికారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషులు, నాయకులు బత్తుల గోవింద రాజులు, వడ్రాణం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ‘నీట్’

- 95.1 శాతం హాజరు నమోదు
- పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత తనిఖీలు
- చేతులకు వాచీలు, ఆభరణాలు, ముక్కు పుడకలు తొలగింపు
- గుంటూరు, తెనాలి, పొన్నూరు కేంద్రాల్లో నిర్వహణ



విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి పంపుతున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య విద్య కోర్సుల జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్–యూజీ) ఆదివారం పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్ల మధ్య సజావుగా జరిగింది. గుంటూరు, తెనాలి, పొన్నూరులలో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల పరిధిలో 95.1 శాతం హాజరు నమోదైంది. నీట్‌కు దరఖాస్తు చేసిన 4,466 మంది విద్యార్థుల్లో 4,248 మంది హాజరయ్యారు. కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. అదేవిధంగా మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేశా రు. విద్యార్థుల చేతులకు వాచీలతో పాటు విద్యార్థినుల ముక్కుపుడకలు, చెవులకు దిద్దులు, చేతులకు గాజులు, కాళ్లకు పట్టీలను పరీక్ష కేంద్రాల వెలుపలే తీసి వేయించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరిగింది.

తెనాలిలో...

తెనాలి: పట్టణంలో నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ఈ పరీక్ష కోసం పట్టణంలోని వెస్ట్‌బెర్రీ పాఠశాల, వివేకానంద సెంట్రల్ స్కూల్‌కు అనుమతించిన విషయం తెలిసిందే. పరీక్షకు 563 మంది విద్యార్థులు హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. ఎన్‌టీఏ మార్గదర్శకాల ప్రకారం నీట్ పరీక్ష సజావుగా జరిగిందని, ఈ పరీక్షకు తొలిసారిగా తెనాలి పట్టణ సిటీ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించిన టీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

క్లుప్తంగా

తమిళనాడు వాసి ఆత్మహత్య



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి శనివారం సాయంత్రం నుంచి ఫుల్‌గా మద్యం తాగి తమిళంలో మాట్లాడుతూ మణిపాల్ సెంటర్, ఓల్డ్ టోల్‌గేట్, సీఎస్ఆర్ కళ్యాణ మండపం ప్రాంతాల్లో తిరుగుతు రాళ్లు విసురుతూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడు. రాత్రి 12 గంటల సమయంలో తనకు తానే బ్లేడుతో పీకమీద కోసుకుని రోడ్డుమీద అటూ ఇటూ తిరుగుతుండడంతో ఓల్డ్ టోల్‌గేట్ వద్ద ఉన్న చెక్ పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స నిర్వహించి ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. ఒకరోజు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని చెప్పడంతో ఆతడిని ఆసుపత్రిలో ఉంచగా తెల్లవారుజామున బయటకు వచ్చి ఆస్పత్రి ఆవరణలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జరిగిన ఈ ఘటనపై విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి మృతుడి వివరాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

- ఓ ప్రయాణికుడి దుర్మరణం
- ఎదురెదురుగా ఢీకొన్న రెండు ఆర్టీసీ బస్సులు



పెద్దదోర్నాల: ఎదురెదురుగా వచ్చిన రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొని ఒక ప్రయాణికుడు మృతిచెందగా, మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఈ ఘటన జరగ్గా, ప్రమాదానికి గురైన బస్సులు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో సుమారు నాలుగు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్దదోర్నాల మండల పరిధిలోని తుమ్మలబైలు– చింతల గిరిజనగూడేల మధ్యలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గుంటూరుకు చెందిన ఊట్ల రాజారావు(68) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఎనిమిది మంది క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెద్దదోర్నాల ఎస్‌ఐ అంకమ్మరావు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. శ్రీశైలం నుంచి మంగళగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, గుంటూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న నరసరావుపేట డిపో ఆర్టీసీ బస్సు ఢీకొన్నట్లు తెలిపారు.

బ్రాహ్మణ హితుడు సీఎం జగనన్న

- అర్చకులను అన్ని విధాలుగా ఆదుకున్న ప్రభుత్వం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



పార్టీలో చేరిన వారితో మంత్రి రజిని, విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్ తదితరులు

పట్నంబజారు: సమాజ శ్రేయస్సును అనునిత్యం ఆకాంక్షించే బ్రాహ్మణ జాతి హితుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, రాష్ట్రంలో వారికి అన్ని విధాలుగా మేలు చేసిన ఘనత ఆయనకే దక్కుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని చెప్పారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నుంచి 70 మంది బ్రాహ్మణులు పార్టీలో చేరారు. 29, 30 డివిజన్ల నుంచి చేరికలు జరగగా, వీరికి పార్టీ కండువాలు కప్పి మంత్రి రజిని, శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ అర్చకత్వాన్ని వారసత్వపు హక్కుగా ఇచ్చిన వ్యక్తి జగనన్న అని కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బ్రాహ్మణులంతా తమ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు.

ప్రజలందరి నమ్మకం జగనన్నపైనే

రాష్ట్రంలో ప్రజలంతా జగనన్న పాలనపై నమ్మకం పెట్టుకున్నారని శాసన మండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. అర్చకులను వేధింపులకు గురి చేసి, వారిని మానసికంగా చంద్రబాబు ఇబ్బందులు పెట్టారని, సీఎం వైఎస్ జగన్ మాత్రమే వారికి మేలు చేశారన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ కచ్చితంగా రానున్న రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో కె.పవన్ కుమార్, రఘునాథ్, శేషాద్రి, లక్ష్మినారాయణాచార్యులు, హరిబాబు, ఎ.శ్రీమన్నారాయణ, పి.ఆకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి, బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గుంటూరు రూరల్ మండలంలోని ఏటుకూరులో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌తో కలసి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత జగనన్నదేనని పేర్కొన్నారు. విద్యా వైద్య రంగాల్లో నాడు– నేడు అమలుతో పేదలకు సేవలు అందుతున్నాయని చెప్పారు. ఇంటి వద్దేకు మెరుగైన వైద్యాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. కూటమి పార్టీలు మైనారిటీల రిజర్వేషన్, బీసీల రిజర్వేషన్‌లను తొలగించాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని మాట్లాడుతూ మరోసారి జగనన్నే ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందిందంటే అది జగనన్న ద్వారానే సాధ్యమైందని వివరించారు. ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి ఆంజనేయులు(లాలుపురం రాము) మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థికి ఒకసారి, ఎమ్మెల్యే అభ్యర్థికి మరోసారి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు, బుడంపాడు సొసైటీ చైర్మన్ మీరజ్‌కుమార్, డివిజన్ కన్వీనర్ పెద్దింటి రామకోటి, రమాదేవి, రజనీకాంత్ పాల్గొన్నారు.

సంక్షేమం అందించిన ఘనత వైఎస్ జగన్‌దే

తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత



తుళ్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత, టీవీ యాంకర్ శ్యామల

తుళ్లూరు(తాడికొండ): సంక్షేమాన్ని అర్హతే ప్రామాణికంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత పేర్కొన్నారు. తుళ్లూరులో ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, టీవీ యాంకర్ శ్యామల, ఎంపీ అభ్యర్థి కుమార్తె కిలారి శ్రీ సాయి నవ్య శ్రీతో కలసి నిర్వహించారు. తొలుత లూథరన్ చర్చి, ఆర్‌సీఎం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని పాస్టర్ల ఆశీర్వాదం తీసుకున్నారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గెలిస్తే రాజధాని ఇక్కడి నుంచి వెళ్లిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజధాని ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లదని, శాసన రాజధాని ఇక్కడే ఉంటుందని చెప్పారు. భూమిలేని నిరుపేదలకు ఇచ్చే జీవన భృతి పెంచి రూ.5000 ఇప్పించడం జరిగిందన్నారు. ఎవరెన్ని ప్రచారాలు చేసినా ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం చూసి సంక్షేమ పథకాలు ఇచ్చేవారని, కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడి చెంతకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ అదనపు ఎన్నికల పరిశీలకుడు గోచిపాతల శ్రీనివాస్, నాయకులు కొప్పుల శేషగిరిరావు, తాడికొండ ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆలోకం సురేష్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, నాయకులు నాయుడు నాగేశ్వరరావు, బుర్రా వెంకట శివారెడ్డి, శృంగారపాటి సందీప్, చలివేంద్రం సురేష్, తుమ్మూరు రమణారెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, చనుమోలు రామారావు, మున్నంగి కోటిరెడ్డి, పుట్టి సుబ్బారావు, పాలకాయల శేషగిరిరావు, దానం వినోద్, ఐనవోలు సుధీర్, చుండు వెంకటరెడ్డి, కొమ్మినేని దత్తు, కాకర్ల నాగేశ్వరరావు, బెజ్జం సాయిప్రసాద్, నేలపాటి నాగేంద్ర, కంతేటి అశోక్ పాల్గొన్నారు.

● మాదిగలను సర్వనాశనం చేసిన చంద్రబాబు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ పేరుతో చంద్రబాబు మాదిగలను సర్వనాశనం చేశారని మాదిగ రిజర్వేషనర్ పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శశికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్గీకరణ జీఓను సుప్రీంకోర్టు కొట్టివేసిన అనంతరం చంద్రబాబు గాలి కొదిలేసినట్లు ఆరోపించారు. కూటమి నేతలను గెలిపించాలని మంద కృష్ణ మాదిగ కోరడం మాదిగలను నట్టేట ముంచడమేనన్నారు. ఎన్నికల్లో బీజేపీ, టీడీపీలను ఓడించాలని పిలుపునిచ్చారు.

లోకేష్ రాకతోనే హత్యా రాజకీయాలు

- వారి కుటుంబం మొత్తం వెన్నుపోటు దారులే
- ఎన్నికల అనంతరం తండ్రీ కొడుకులిద్దరు జైలుకే
- వైఎస్సార్ సీపీ నాయకురాలు లక్ష్మీపార్వతి



మంగళగిరి అభ్యర్థి లావణ్యకు హారతి ఇస్తున్న మహిళలు, పక్కన లక్ష్మీపార్వతి

తాడేపల్లిరూరల్: నారా వారి కుటుంబం అంటేనే వెన్నుపోటుకు మారుపేరు అని, నారా లోకేష్ ఎంట్రీతోనే మంగళగిరిలో హత్యా రాజకీయాలకు తెరలేచిందని వైఎస్సార్ సీపీ నాయకురాలు నందమూరి లక్ష్మీపార్వతి ఆరోపించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపార్వతి విలేకరులతో మాట్లాడుతూ 'నారా' కుటుంబం కుట్రలకు, కుతంత్రాలకు, వెన్నుపోటుకు పెట్టింది పేరని చెప్పారు. గతంలో ఒక బీసీ మహిళ, ఇటీవల వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి హత్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజల కోసం ఏ విధంగా ఆలోచించి పరిపాలన చేశారో అదే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని కొనియాడారు. మురుగుడు లావణ్యను మంగళగిరి ఓడించేందుకు నారా వారి కుటుంబం మొత్తం మంగళగిరిలోనే మకాం వేసిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండి మన లావణ్యను గెలిపించాలని కోరారు. ఎన్నికల అనంతరం చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ జైలుకు వెళ్లక తప్పదని, ఆంధ్రప్రదేశ్ ఫైబర్ గ్రిడ్, రాజధాని భూముల విషయంలో తండ్రీ కొడుకులు చేసిన కుంభకోణానికి మూల్యం చెల్లించుకోక తప్పదని, ఇప్పటికైనా నందమూరి తారకరామారావు వారసులు అర్థం చేసుకుని వెన్నుపోటు చంద్రబాబుని విడిచిపెట్టి ఎన్టీఆర్ ఆశయాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈ.డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఎం.వివేకానందరెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఎండి గోరే, దర్శి విజయశ్రీ, మాచర్ల అబ్బు, స్నేహ సంధ్య పాల్గొన్నారు.

జన ప్రభంజనంతో పులకింత



భారీ గజమాలతో ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్‌ను సన్మానిస్తున్న స్థానికులు

- రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు
- ఐతానగర్‌లో తెనాలి అభ్యర్థి శివకుమార్ పాదయాత్ర
- కౌన్సిలర్ సురేంద్ర నాయకత్వంలో బ్రహ్మరథం పట్టిన స్థానికులు

తెనాలి అర్బన్: పేద ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెనాలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి ఐతానగర్‌లోని 1, 2, 39 వార్డుల్లో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 1వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర, 39వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గెడ్డేటి ఝాన్సీవాణి దంపతుల ఆధ్వర్యంలో తెనాలి ఐతానగర్‌లో శివకుమార్ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో ఆయనకు ఘనస్వాగతం పలికారు.తొలుత ఐతానగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. అనంతరం 1వ వార్డు నుంచి పాదయాత్ర ప్రారంభించారు. రోడ్డుపైకి వచ్చిన స్థానికులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. లింగారావు సెంటర్ వద్ద భారీ గజమాలతో వారిని సన్మానించారు. అక్కడక్కడ స్థానికులు శివకుమార్‌కు పూల మాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గుర్రంపై యువతి స్వాగ్ చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. దారి విద్యుత్ దీపాలతో అలంకరించిన వైఎస్సార్‌సీపీ జెండాలు ఉన్న గొడుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వేషాధారణలో ఓ వ్యక్తి ఆయనవలే మాట్లాడుతూ అందరిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన ప్రాంతంలో ప్రజలు బ్రహ్మరథం పట్టడం సంతోషానిచ్చిందని చెప్పారు. ఐతానగర్ ప్రాంతవాసిగా తాను అందరి అభిమానాన్ని చురగొన్నాననే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తోట రఘురామ్, తాడిబోయిన రామయ్య, షేక్ దుబాయ్‌బాబు, కొమరాబత్తిన జయపాల్, గుంటూరు కోటేశ్వరరావు, ఆవుల కోటయ్య, మట్లపూడి సంధ్యారాణి, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, ఎంపీపీ ధర్మరాజులు చెన్నకేశవులు, సర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, గెడ్డేటి బాలయ్య, నాలాది ప్రభాకర్, కొమ్ము రాయల్, జలగం రామకృష్ణ, అత్తోట శ్యామ్, మట్లపూడి రాజేశ్వరరావు, కాకిదేవ సహాయం, జేబీ జిలానీ, అక్కిదాసు కిరణ్‌కుమార్, గొర్రెపాటి వేణుగోపాలరెడ్డి, గుంటూరు గోపి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, ఏలూరి శేషగిరిరావు, నీలి అజయ్, షేక్ మీరావలి, ఎన్ఆర్‌కే శర్మ, గోల్డ్ రహిమా, వేజండ్ల శ్రీకాంత్, బొమ్ము నాగిరెడ్డి, రావి శ్రీనివాసరావు, కోగంటి ఆషు, పినపాటి నిరంజన్, కానంపూడి రఘురామిరెడ్డి, అత్తోట అమృతరాజు, కుక్కల ముత్యేశ్వరరావు, బాలరాజు, మల్లెబోయిన రాము, కరణి పారిష్, ధరణికోట మల్లి, తట్టుకుక్క ఆశోక్‌యాదవ్, చుక్కా ఆనంద్, రుంగారి సాయి, నల్లగండ్ల రవిచంద్ర పాల్గొన్నారు.



పాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



అరిమండలో ప్రజలకు అభివాదం చేస్తున్న అంబటి మురళీకృష్ణ

- పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మరో నెలరోజుల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని పార్టీ పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. ఆరిమండ, గాయంవారిపాలెం, దండమూడి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంబటి మురళీకృష్ణకు ఆయా గ్రామాల ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. మహిళలు హారతులిచ్చి, పూలవర్షం కురిపించారు. గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానికులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందించిన ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు బొనిగల వేణుప్రసాద్, షేక్. నాజర్, వడ్రాణం ప్రసాద్, అంబటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ రుణం తీర్చుకుంటాం

ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ పాలన ఎలా ఉందని, సంతోషంగా ఉన్నారా అని మురళీకృష్ణ ప్రజలను అడిగారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందామని, ఆయన చేసిన మేలుకు ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి రుణం తీర్చుకుంటామని స్థానికులు మురళీకృష్ణ ఎదుట ముక్తకంఠంతో పలికారు. ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రజలకందించిన సంక్షేమాన్ని చూసి ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించేలా చేయాలని అంబటి మురళీకృష్ణ ఓటర్లను అభ్యర్థించారు.

బీసీలకు సీఎం వైఎస్ జగన్ తగిన ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిశేషు

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీతోనే బీసీలకు మేలు చేకూరిందని అన్నారు. గత ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగానే భావించాయని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం అనేక పథకాలను అమలు చేసి వారి అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని వివరించారు. 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించి, 13 డైరెక్టర్లను ఏర్పాటు చేసి బీసీల నాయకత్వాన్ని పటిష్టపరిచిన నేతగా సీఎం జగన్ నిలిచారని అన్నారు. బీసీలకు నామినేటెడ్ పదవులు, కాంట్రాక్ట్ పనుల్లో 50 శాతం అవకాశం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతోందని వివరించారు. 13 మంది బీసీలకు మంత్రులుగా, ఐదుగురికి రాజ్యసభ సభ్యులుగా చేసిన ఘనత సీఎం జగన్‌దే నన్నారు. ఏ విషయంలోనూ బీసీలకు ప్రాధాన్యమివ్వని అపవిత్రమైన టీడీపీని ఎవరూ నమ్మవద్దని కోరారు. బీసీల అభివృద్ధికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎల్లప్పుడూ అండగా ఉండాలని, ఆయనను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు బీసీలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యువజన అధ్యక్షుడు చల్లారవి, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు కొల్లేరు శ్రీనివాసరావు, నాయకులు షేక్ నాజర్, బత్తుల గోవిందరాజులు పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా..



వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుమార్తె మణి కుమారి, అల్లుడు గంగాధర్, కోడలు స్వప్న వినుకొండ రూరల్ అందుగుల కొత్తలపాలెంలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడుని, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు.

హోం ఓటింగ్ ప్రక్రియ పరిశీలన



పర్చూరు (చినగంజాం): పర్చూరు మండలంలోని పోతుకట్ల, ఉప్పుటూరు గ్రామాల్లో జరిగిన హోం ఓటింగ్ ప్రక్రియను పర్చూరు రిటర్నింగ్ అధికారి జి.రవీందర్ ఆదివారం పరిశీలించారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రం వద్దకు నడవలేని దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ ఇంటి దగ్గర నుంచి ఓటు వేసుకునే సౌలభ్యం కల్పించింది. తహసీల్దారు సుబ్బయ్య, పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

మేమంతా వైఎస్సార్ సీపీ వెంటే..



పొన్నూరు: ఇటీవల రాజీనామా చేసిన సచివాలయ వలంటీర్లు ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణను కలిశారు. జగనన్న ప్రభుత్వం తమకు అండగా నిలిచిందన్నారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థపై టీడీపీ, జనసేన పార్టీలు దుర్మార్గంగా వ్యవహరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా వైఎస్సార్ సీపీ గెలుపు కోసం స్వచ్ఛందంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, మళ్లీ జగనన్న సంక్షేమంలో వలంటీర్లు ప్రజలకు సేవలు అందించడం తథ్యమన్నారు.

ఆరోగ్యమస్తు

ఇదిగో..మార్పు

వైద్యం అందుబాటులోకి వచ్చింది. అన్ని రకాల సేవలు అందున్నాయి. ఖరుదైన వైద్యం పేదలకు చేరింది. నాడు- నేడుతో వైద్యరంగం ఎన్నడూ లేని మార్పు సంతరించుకుంది. ప్రస్తుతం అధునాతన సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వైద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా గుంటూరు సమగ్ర ఆస్పత్రి వైద్యానికి ప్రసిద్ధి చెందింది.



ఎంసీహెచ్ వార్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజని, ఎమ్మెల్యే ముస్తఫా, అప్పిరెడ్డి, కావటి, లక్ష్మణరావు

- జీజీహెచ్ వైద్యారంగానికి తలమానికం
- ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ
- కోట్లాది రూపాయల పరికరాలు మంజూరు
- భవన నిర్మాణాల కోసం రూ.కోట్లు ఖర్చు

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాస్పత్రిగా గుంటూరు జీజీహెచ్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. గత ప్రభుత్వం హయాంలో టార్చిలైట్ వెలుతురిలో ఆపరేషన్లు.. ఎలుకల దాడిలో పసికందు మృతి లాంటి ఘటనలతో ఆస్పత్రి ప్రతిష్ట మసకబారింది. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు జీజీహెచ్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు.

పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి...

యూరాలజీ, న్యూరాలజీలో అదనపు యూనిట్లు మంజూరు చేశారు. నూతనంగా 15 ప్రొఫెసర్లు, 15 అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు మంజూరు చేశారు. జీజీహెచ్‌లో 250 స్టాఫ్ నర్సుల పోస్టులు మంజూరు చేశారు. ఒకేసారి గుంటూరు వైద్య కళాశాలలో 46 పీజీ సీట్లు, ఆరు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరు చేయించడం ఓ చరిత్రే. 110 పారా మెడికల్ పోస్టులు నూతనంగా మంజూరు చేశారు. గుంటూరు వైద్య కళాశాల ఆధునికీకరణకు రూ.500 కోట్లు, పీజీ సీట్ల వసతుల కల్పనకు రూ.40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

మంత్రి రజని చొరవతో ఎంసీహెచ్ వార్డు

టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రెండు సార్లు శిలాఫలకాలు వేసి ఒక్క ఇటుక కూడా కట్టకుండా పబ్లిసిటీ చేసుకున్న మదర్ అండ్ చైల్డ్ హెల్త్ వార్డు (మాతాశిశు సంరక్షణ కేంద్రం) నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వం, జింకానా సహకారంతో రూ. 80 కోట్లతో నిర్మితమవుతున్న ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఎంసీహెచ్ నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం మూడు అంతస్తులు నిర్మాణం పూర్తయింది. కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి రూ.70 లక్షలతో గైనిక్ విభాగాన్ని ఆధునికీకరించారు. అత్యవసర చికిత్సలకు రోగులను తరలించేందుకు రూ.70 లక్షలతో రెండు అంబులెన్సులను మంత్రి రజిని జీజీహెచ్‌కు అందజేశారు. గత ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన సర్వీస్‌బ్లాక్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7.5 కోట్లు మంజూరు చేసింది. కాకుమానువారితోటలో నూతన ఓపీ భవన నిర్మాణం కోసం మంజూరు చేసిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ. 3.5 కోట్లు మంజూరు చేశారు. ఆసుపత్రిలో సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతులు కోసం రూ.8.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.


అదనపు హంగులు...

అదనంగా హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎమర్జెనీ మెడిసిన్ వంటి వైద్య విభాగాలు ప్రభుత్వం మంజూరు చేసింది.



పరికరాలకు తగిన నిధులు

వైద్య పరికరాలకు రూ. 64 కోట్లు మంజూరు చేశారు. క్యాన్సర్ సెంటర్‌లో రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్‌సిటీ పరికరం కొనుగోలుకు అవకాశం ఇచ్చారు. ఆస్పత్రికి రూ. 4 కోట్లు ఖరీదుచేసే సీటీస్కాన్ పరికరాన్ని మంజూరు చేశారు. రూ.15 కోట్ల ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్, రూ.40 లక్షలు ఖరీదు చేసే సీఆర్మ్, రూ.25 లక్షలు ఖరీదు చేసే కొలనోస్కోపి, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఏబీజీ మిషన్‌లు, రూ.25 లక్షలు ఖరీదు చేసే మైక్రోస్కోప్, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్ లైట్లు, రూ.15 లక్షలు ఖరీదు చేసే మానిటర్స్, రూ.16 లక్షలు ఖరీదు చేసే ఓటీ కార్ట్స్, రూ.20 లక్షలు ఖరీదు చేసే ఎకోమిషన్, ఎన్ఐసీయూ, పీఐసీయూలో కోటి రూపాయల ఖరీదు చేసే వైద్య పరికరాలను మంజూరు చేశారు. కొవిడ్‌లో ఆసుపత్రి మొత్తం ఆక్సిజన్ సరఫరా జరిగేలా కోట్లాది రూపాయలు ఖరీదు చేసే ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణం, ఆక్సిజన్ పైపుల నిర్మాణం చేయడంతోపాటు, 200లకుపైగా వెంటిలేటర్లను ప్రభుత్వం సరఫరా చేసింది.



రూ. 4 కోట్లు ఖరీదుచేసే సీటీస్కాన్

ఐదేళ్లలో..రూ.6లక్షల లబ్ధి..



గుడిపాడు(క్రోసూరు): సీఎం జగనన్న అందించిన సంక్షేమ ఫలాలతో అత్యధికంగా రూ.6లక్షల లబ్ధి పొందినట్లు గుడిపాడు గ్రామానికి చెందిన షేక్ జానీ బేగం సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం సోషల్ మీడియా బృందం(శంకరన్న కోసం) ఎన్నికల ప్రచారం చేస్తున్న సందర్భంలో గుడిపాడులో షేక్ జానీ బేగం స్పందించారు. అమ్మఒడి, రైతు భరోసా, ఇంట్లో తనకు, తన తల్లికి పింఛను నగదు అందుతోందని, ఇంటి స్థలం, గృహ నిర్మాణం చేసుకున్నట్లు వరుసపెట్టి వివరించారు. ఇంత మంచి చేస్తున్న జగనన్నకే తాము ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.

'కొండ'ంత అభిమానం..



చీరాల: సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ గెలవాలని ఆయన వీరాభిమాని మల్లెల రవీంద్రబాబు ఆదివారం గుణదల కొండను మోకాళ్లపై ఎక్కి తన అభిమానాన్ని చాటుకున్నాడు. చీరాల మున్సిపాలిటీలోని 9వ వార్డుకు చెందిన రవీంద్రబాబు తన అభిమాన నాయకుడు ఎమ్మెల్యే కావాలని గుణదల మేరిమాతకు మొక్కుకున్నాడు. మోకాళ్లపై కొండ ఎక్కి తన అభిమానాన్ని చాటాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మొక్కుకున్నాడు.





సత్తెనపల్లిలో బారులు తీరిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు



గుంటూరు మహిళా కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకుంటున్న ఉద్యోగులు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



వినుకొండ పట్టణంలోని లయోలా పాఠశాలలో క్యూలో ఉద్యోగులు



గణపవరంలో డీఎస్పీ వర్మకు వివరాలు తెలుపుతున్న నరసరావుపేట ఆర్వో నారదముని



ఎస్ఎస్ఎన్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ తీరును పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్



గణపవరంలో వివరాలు ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీకి వివరిస్తున్న నరసరావుపేట ఆర్వో నారదముని

కార్యకర్తలే.. వైఎస్సార్ సీపీ మహా సైన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజని, పక్కన విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

- పశ్చిమ తలరాతను నిర్ణయించే సమయం వచ్చేసింది
- ఈ వారం.. ప్రతి క్షణం అప్రమమత్తం అవసరం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- పశ్చిమలోని కార్పొరేటర్లు, నాయకులతో ప్రత్యేక సమావేశం
- హాజరైన మండలి విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మదాళి గిరి

పట్నంబజారు: ఎగిసి పడుతున్న సముద్రపు అలలకు సైతం ఎదురొడ్డి పోరాడగల సత్తా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సొంతమని.. పార్టీకి కార్యకర్తలే మహా సైన్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పోరాటాలతో పుట్టిన వైఎస్సార్ సీపీకి పోరు కొత్తేమి కాదని స్పష్టం చేశారు. అచంచల విశ్వాసంతో.. అలుపెరుగని దీక్షతో ముందుకు సాగే ప్రతి కార్యకర్తకు, నేతకు అండగా ఉంటామని హామినిచ్చారు. పశ్చిమ తలరాతను నిర్ణయించే సమయం వచ్చేసిందని, ఈ వారం రోజులే అత్యంత కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అప్రమత్తం చేశారు. డివిజన్‌లో ఇప్పటికే క్షేత్రస్థాయికి వెళ్లి నాయకులంతా కష్టపడి పనిచేస్తున్నారని, ఇలానే ముందుకు సాగితే ఊహించిన దానికంటే గొప్ప ఫలితాన్ని సాధించవచ్చొన్నారు.

ఐక్యంగా పనిచేద్దాం..

పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుదామని శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలే రేపటి విజయానికి నాంది పలుకుతాయని స్పష్టం చేశారు. పార్టీ జెండాను భుజాన పెట్టుకుని కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు తలెత్తితే.. తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు

- ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోండి
- ఇప్పటికే 9.50 లక్షల ఓటర్ స్లిప్పులు అందజేశాం
- ఓటు ఉన్న ప్రతి ఒక్కరికీ స్లిప్పు అందుతుంది
- పోస్టల్ బ్యాలెట్‌పై ఆందోళన వద్దు
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు వెస్ట్: ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్, 7 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని మీడియా సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థుల, ప్రజల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో 17,91,543 మంది ఓటర్లున్నారన్నారు. వీరిలో ఇప్పటికే 9.50 లక్షల మందికి ఓటరు స్లిప్పులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశామన్నారు. 3.50 లక్షల ఓటర్లకు ఇప్పటికే ఎపిక్ కార్డులు కూడా అందజేశామని తెలిపారు. త్వరలో అందరికీ ఓటరు స్లిప్పులు అందుతాయని చెప్పారు. జిల్లాలోని పార్లమెంట్, 7 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 132 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని చెప్పారు. హోం ఓటింగ్‌కు సంబంధించి 85 ఏళ్లు పైబడిన వారు 12,611 మంది, దివ్యాంగులు 17,357 మొత్తం 29,968 మంది ఉన్నారన్నారు. వీరంతా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని ఆదర్శంగా నిలిచారన్నారు. వీరి ఓటరు స్లిప్పులు రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉన్నాయన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై ఆందోళన వద్దు...

కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 5 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్‌లో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చే ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సోమవారం సాయంత్రం వరకు వారు అక్కడే పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చన్నారు. మన జిల్లాలో పనిచేసేవారు ఇక్కడే పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకుంటారని, ఇక్కడ పనిచేస్తూ ఇతర జిల్లాలో ఓటు ఉన్న వారికి ఆయా జిల్లా కలెక్టర్ల వద్ద నుంచి ఫామ్-12ను తెప్పిస్తున్నామని, అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందికి ఇక్కడ ఓటు ఉంటే వారికి కూడా ఫామ్-12ను ఆయా జిల్లాలకు పంపిస్తున్నామన్నారు. దీనివల్ల ఎవరూ ఓటు హక్కును కోల్పోనవసరం ఉండదన్నారు. ఇప్పటివరకు 5860 ఫామ్-12 దరఖాస్తులు ఇతర జిల్లాలకు పంపగా, మనం ఇతర జిల్లాల నుంచి 5092 తీసుకొచ్చామని చెప్పారు. వారంతా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకుంటారన్నారు.

ఇబ్బందులు పడవద్దు: ఎస్పీ

సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎటువంటి విధ్వంసకర సంఘటనలు జరగలేదన్నారు. తనిఖీ బృందాలతోపాటు పోలీస్ సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో అనవసర ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. కొన్ని గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశముందని వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

అదనంగా ఈవీఎంలు..

జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో ఇతర జిల్లాల నుంచి అదనంగా ఈవీఎంలను తెప్పించామని కలెక్టర్ తెలిపారు. పార్లమెంట్‌కు 2239, అసెంబ్లీలకు 1020 తెప్పించామని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచే ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ జరుగుతుందన్నారు. 1309 పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. 372 పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వివరించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌పై టీడీపీ నాయకుల దౌర్జన్యం

నాదెండ్ల: గణపవరంలోని శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఓటు వేసేందుకు వచ్చే వారిని టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారు. ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున నగదు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా కెమెరాలు ఏర్పాటు చేసింది. ఆ ఇంట్లోకి వచ్చిపోయే వారిని గుర్తించడంతో.. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆ ఇంటి వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో టీడీపీ నాయకులు స్క్వాడ్‌కు అడ్డు తగిలారు. ఇద్దరు సిబ్బందిని చొక్కా పట్టుకుని లాగి పడేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

పెట్రోల్ బంకు యజమానిపై కేసు నమోదు

- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన
- రాజకీయ పార్టీ ర్యాలీ బైక్‌లకు కూపన్లతో పెట్రోల్ పట్టిన వైనం
- అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో తనిఖీ



నారాకోడూరులోని బంకులో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

చేబ్రోలు: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలు బంకులో రాజకీయ పార్టీలకు చెందిన ద్విచక్ర వాహనాల ర్యాలీకి కూపన్ల ద్వారా రూ.2 వందల లెక్కన పెట్రోలు పోస్తున్న బంకు యజమానిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, పొన్నూరు నియోజకవర్గ ఎఫ్ఎస్టీ బృందాలు సంయుక్తంగా చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలోని సురేంద్ర ఆయిల్ పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన ర్యాలీకి వెళ్లే ద్విచక్ర వాహనాలకు కూపన్‌లు తీసుకొని రూ.200లు లెక్కన పెట్రోల్ పోస్తున్నట్లుగా గుర్తించారు. పెట్రోలు బంకులో 374 కూపన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా కూపన్లు తీసుకొని రాజకీయ పార్టీల ర్యాలీకి పెట్రోలు పోయటం చట్ట వ్యతిరేక చర్య అని అధికారులు హెచ్చరించారు. దీనిపై బంకు మేనేజర్‌ను అదుపులోకి తీసుకోవాలని పొన్నూరు నియోజకవర్గ ఎఫ్ఎస్టీ బృందం ఇన్‌చార్జి వెంకట్రావును అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు కిరణ్ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ మహమూద్ ఆసిఫ్, జీఎస్టీ ఆఫీసర్ వైస్.నాగేశ్వరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.